# 6. రమజాన్ ప్రాముఖ్యం

-అబుల్ ఇర్ఫాన్

రమజాన్ నెలవంక కన్పించగానే మసీదులన్నీ భక్తజనంతో కళకళలాడతాయి. ఆరోజు రాత్రినుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమవుతాయి. మరునాడు ఉషోదయానికి ముందే ముస్లింలు మేల్కొని ఉపవాసాల పాటింపుకు సన్నాహాలు చేస్తారు. ఇలా తెల్లవారు జామున భోజనం చేయడాన్ని సహ్రీ అంటారు. అప్పట్నుండి సూర్యాస్తమయం వరకు ఆహారపానీయాలేవీ ముట్టుకో కూడదు. సూర్యాస్తమయం కాగానే అల్పాహారంతో ఉపవాసవ్రతం విరమిస్తారు. దీన్నే ఇఫ్తార్ అంటారు. ఇలా రమజాన్ నెలంతా సాగుతుంది.

రమజాన్ ముస్లింలకు అపార శుభాలు తెచ్చే వరాల వసంతం. ఆ వరాల వసంతం రాగానే తలబిరుసు భూతాలకు సంకెళ్ళు పడతాయి. నరకద్వారాలు మూయబడతాయి. స్వర్గద్వారాలు తెరవబడతాయి. దేవుని ప్రత్యేకదూత భూలోకవాసుల్ని సంబోధిస్తూ "శుభాలు, శ్రేయాలు కోరుకునేవాడా! (సత్కార్యాలు చేయడానికి) ముందుకు రా. చెడులు, దురాచారాల వెంటపడేవాడా! ఆగిపో" అని ప్రకటిస్తాడు. అయితే ఆ శుభాలు, శ్రేయాలు ఎలా ప్రాప్తమవుతాయి? చెడ్డపనులు మానుకొని ఉపవాసాలు పాటిస్తూ, దానధర్మాలు తదితర సత్కార్యాలు చేసినప్పుడే అవి లభిస్తాయి. ఇంతకూ ఉపవాసాల లక్ష్యం ఏమిటీ? ఇవి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) కాలం నుండే మొదలయ్యాయా దీనికి ఖుర్ఆన్ ఇలా సమాధానం ఇస్తోంది :

"విశ్వాసులారా! గతప్రవక్తల అనుయాయులకు ఏవిధంగా ఉపవాసాలు విధించబడ్డాయో అదేవిధంగా (ఇప్పుడు) మీక్కూడా ఉపవాసాలు విధించాం. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశముంది." (2:183)

దేవుని పట్ల భయభక్తులు జనించినప్పుడే మనిషి చెడు పనులు వదలి మంచిపనులు చేస్తాడు. తానిక్కడ చేసే పాపాలకు పరలోకంలో కఠినశిక్ష చవిచూడ వలసివస్తుందని మనిషి ఎల్లప్పుడూ భయపడుతూనే ఉండాలి. ప్రత్యేకంగా రమజాన్ నెలలో ఉపవాసాల పాటింపు ద్వారా మరింత దైవభీతి జనించే అవకాశముందని ఖుర్ఆన్ చెబుతోంది.

దైవభీతికి కారణభూతమయ్యే ఉపవాసవ్రతాన్ని అరబీ భాషలో సౌమ్ అంటారు. సౌమ్ అంటే చేస్తున్న పనినుండి ఆగిపోవడం, దాన్ని విడనాడటం అని అర్థం. శాస్త్రపరిభాషలో ఉషోదయం నుండి సూర్యాస్తమయం వరకు తినడం, త్రాగడం, సంభోగించడం వంటి అవసరాలను మానుకోవడాన్నే సౌమ్ అంటారు.

అయితే పై మూడు అవసరాలు విడనాడినంత మాత్రాన ఉపవాస లక్ష్యం నెరవేరదు. చెడు పనులకు, చెడు ఆలోచనలకు కూడా దూరంగా ఉండాలి. అబద్ధాలాడటం, అబద్ధాలు ఆచరించడం వదలనివాడు (ఉపవాస పాటింపు ద్వారా) ఆకలి దప్పులతో ఉండటం పట్ల



దేవునికి ఏమాత్రం ఆసక్తి లేద"న్నారు దైవప్రవక్త (సల్లం). నిజానికి మనిషి వీటికి ఎల్లప్పుడూ దూరంగానే ఉండాలి. కాకపోతే రమజాన్ నెలలో మరింత నిష్ఠగా ఉండాలి. అప్పుడే ఈ ఉపవాసాలు ముస్లింలకు శుభాలు, శ్రేయాలు చేకూరుస్తాయని ఆశించగలం.

రమజాన్‌లో పూర్తి నెలరోజులు ఉపవాసాలు పాటించడం వయోజనులైన స్త్రీ పురుషులందరికీ విధిగా నిర్ణయించబడింది. వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, పిల్లలు, ప్రయాణీకులు ఈ విధి నుండి మినహాయించబడ్డారు. ఖుర్ఆన్ ఈ విధిని గురించి ఇలా పేర్కొన్నది :

"....కనుక ఇకనుండి ఎవరు రమజాన్ నెలను చూస్తారో వారు ఆ నెలంతా విధిగా ఉపవాసం పాటించాలి. అయితే ఎవరైనా వ్యాధిగ్రస్తులయితే, లేదా ప్రయాణావస్థలో ఉంటే వారా ఉపవాసాలను వేరే దినాలలో పూర్తిచేయాలి. దేవుడు మీకు సౌలభ్యం కలగజేయాలని కోరుతున్నాడు గాని, మిమ్మల్ని ఇబ్బందులలో పడవేయాలని భావించడంలేదు". (2:185)

దైవప్రవక్త (సల్లం) ఒకసారి షాబాన్ నెల చివరి తేదీన మసీదులో నిలబడి ప్రసంగిస్తూ ఇలా బోధించారు : "ప్రజలారా! మహోజ్వలమైన అపార శుభాల మాసం ఒకటి త్వరలో రాబోతోంది....ఆ నెల ఎవరైనా అంతర్ ప్రేరణతో, సంతోషంగా ఒక సత్కార్యం చేస్తే, అది ఇతర మాసాల్లో విధి (ఫర్జ్)ని నిర్వర్తించిన దానితో సమానం. మరెవరైనా ఆ నెలలో విధిగా నిర్ణయించిన కార్యం నిర్వహిస్తే, అది ఇతర నెలల్లో 70 విధులు నిర్వర్తించిన దానికి సమానం. ఇది సహనం వహించవలసిన నెల. సహనానికి ప్రతిఫలం స్వర్గం. ఇది సమాజంలోని బీదసాదల పట్ల సానుభూతి చూపాల్సిన నెల." (మిష్కాత్)

మరో సందర్భంలో ఆయన ఇలా ప్రవచించారు: "ఏ మనిషి ధర్మనిష్ఠతో, ఆత్మావలోకనా దృక్పథంతో, పరలోక ప్రతిఫలాపేక్షతో రమజాన్ ఉపవాసాలు పాటిస్తాడో అతను గతంలో చేసిన పాపాలన్నిటినీ దేవుడు మన్నిస్తాడు. అలాగే మరెవరు ధర్మనిష్ఠతో, ఆత్మావలోకనా దృక్పథంతో, పరలోక ప్రతిఫలాపేక్షతో తరావీ నమాజ్ చేస్తాడో అతని గత పాపాలను కూడా దేవుడు క్షమిస్తాడు". (ముత్తఫకున్ అలై)

రమజాన్ నెలకు ఇంత ప్రాముఖ్యం రావడానికి కారణం ఆ నెలలో ఖుర్ఆన్ అవతరణ ప్రారంభం కావడమే. మహనీయ ముహమ్మద్ (సల్లం) ఎల్లప్పుడూ దైవచింతన, సమాజ సంస్కరణలను గురించే ఆలోచిస్తుండేవారు. చివరికి నలభైయేళ్ళ ప్రాయంలో ఆయన ఏకాగ్రత కోసం మక్కా పట్టణం శివార్లలోని సౌర్ గుహకు తరచుగా వెళ్ళడం ప్రారంభించారు. ఆ కాలంలోనే ఓరోజు ఆ గుహలోకి ఓ విచిత్రవ్యక్తి వచ్చి ముహమ్మద్‌ని గట్టిగా అదిమి వదిలేసి, పఠించు నీప్రభువు పేరుతో అన్నాడు. చదువురాని ముహమ్మద్ ఈ హఠాత్సంఘట నకు భయపడిపోయారు. ఆ విచిత్ర వ్యక్తి దైవప్రవక్తలకు దైవసందేశం చేరవేసే దైవదూత జిబ్రీల్. దేవుడు ముహమ్మద్‌ని అంతిమ దైవప్రవక్తగా నియమించినందున, జిబ్రీల్ దూత ఆయనకు ఈ సంగతి తెలియజేసి దైవసందేశం అందజేయడానికి వచ్చారు.

ఈ విధంగా ఖుర్‌ఆన్ అవతరణ ప్రారంభమై 23 సంవత్సరాలు సాగింది. ఈ సంఘటన రమజాన్ నెలలో సంభవించింది. అందువల్ల కనీసం ఏడాదికొకసారి రమజాన్ నెలలో మొత్తం ఖుర్‌ఆన్ పఠించడం ముస్లింల సంప్రదాయమైపోయింది. వారీ పనిని రాత్రివేళ ప్రత్యేక ప్రార్థనల ద్వారా నిర్వహిస్తారు. దీన్నే తరావీ నమాజ్ అంటారు.

పొద్దస్తమానం ఆకలిదప్పులతో గడిపాం కదా, ఇక రాత్రికి సుష్టుగా తిని మస్తుగా పడుకుందాం అంటే కుదరదు. అసలు ఆరాధన రాత్రివేళే ప్రారంభమవుతుంది. దైవంతో దాసుడు తన సంబంధాన్ని పటిష్ఠం చేసుకోవడానికి సరైన అదను రాత్రివేళే. దీనికోసం ఇస్లాం రోజూ చేసే ఐదు పూటల నమాజులే గాక రమజాన్‌లో అదనంగా ఇరవై రకాత్‌ల తరావీ నమాజ్ నిర్ణయించింది. నమాజులో ముస్లింలు ఖుర్‌ఆన్ పఠిస్తూ అందులోని దైవాజ్ఞల్ని మాటిమాటికి మననం చేసుకుంటారు. ఇలా వారు జీవిత సమస్తరంగాల్లో ఖుర్‌ఆన్ బోధనల ప్రకారం నడచుకోడానికి వీలుకలుగుంది. తరావీ నమాజ్ మరింత అవకాశం కల్పిస్తుంది.

అరబీభాష తెలిసినవారు నమాజ్‌లోనే ఖుర్‌ఆన్ బోధనలు అర్థం చేసుకుంటారు. మరి అరబీభాష రానివారి సంగతేమిటీ? నమాజ్‌లో అరబేతర భాషలో ఖుర్‌ఆన్ పఠించడానికి అనుమతి లేనందున ఇతర సమయాల్లో ఖుర్‌ఆన్ అనువాద గ్రంథాలు చదివి దాని బోధనలు గ్రహించాలి. తరావీ నమాజులో ప్రతి నాలుగు రకాత్ (యూనిట్)ల తరువాత కాస్సేపు విశ్రాంతి తీసుకోవడం సంప్రదాయం. ఈనాడు కొన్ని చోట్ల ఈ విరామ సమయాల్లో ఖుర్‌ఆన్ అనువాదం విన్పించడం జరుగుతోంది. ఇది చాలా మంచి పరిణామం అని చెప్పవచ్చు.

రమజాన్ 21వ తేదీ నుండి మాసాంతం వరకు ఏతికాఫ్ అనే ఓ తపోనిష్ఠను పాటించడం సంప్రదాయం. భక్తికి పరాకాష్ఠ ఈ తపోనిష్ఠే. ఏతికాఫ్ (తపోనిష్ఠ) పాటించదలచినవారు మసీదులోనే ఒక మూలన ఓ తెర కట్టుకొని అక్కడ దైవధ్యానం, ఖుర్‌ఆన్ పారాయణం, ఐచ్ఛిక ప్రార్థనలు చేయడంలో నిమగ్నులయి ఉంటారు.

ఏతికాఫ్ విశ్వాసికి ఓ శిక్షణ శిబిరం లాంటిది. అందువల్ల ఏతికాఫ్ పాటించేవారు ఈ శిబిరంలో గడిపే పదిరోజుల కాలాన్ని దైవధ్యానం, గ్రంథపారాయణం, పరలోక చింతన వగైరా పుణ్యకార్యాల్లో లీనమై పూర్తిగా సద్వినియోగం చేసుకుంటారు. సృష్టికర్త ఏ విశ్వాసికీ ఇవ్వనటువంటి ప్రత్యేక వరం ఏతికాఫ్ పాటించే వ్యక్తికి ఇస్తున్నాడు. అదేమిటో చూడండి:

సాధారణ పరిస్థితుల్లో మనిషికి ఏదైనా చెడు తలంపు వస్తే, తత్సంబంధమైన చెడ్డపని అతని వల్ల జరగనంత వరకు అతని కర్మల జాబితాలో పాపం రాయడం జరగదు. అదే మంచి తలంపు అయితే దానికి సంబంధించిన మంచిపని అతను చేయకపోయినా అతని కర్మల జాబితాలో దానికి పుణ్యం రాయడం జరుగుతుంది. ఏతికాఫ్ పాటించే వ్యక్తి గురించి



దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "ఏతికాఫ్ పాటించే వ్యక్తి ఏతికాఫ్ దినాలలో చెడులకు దూరంగా ఉంటాడు. అంచేత అతను ఇతర దినాలలో చేసే సత్కార్యాలన్నిటికీ రాయబడే పుణ్యం ఇప్పుడతనికి రాయబడుతుంది." (ఇబ్నె మాజ)

రమజాన్ నెలలో ఖుర్‌ఆన్ అవతరణ (దివ్యావిష్కృతి) ప్రారంభమైందని మనం తెలుసుకున్నాం. అయితే ఈ తొలి దివ్యావిష్కృతి (Revelation)కి సంబంధించిన సంఘటన రమజాన్‌లో ఏరోజున సంభవించిందో కచ్చితంగా తెలియదు. రమజాన్ చివరి దశకంలో ఏదో ఒకరోజు రాత్రి అయివుంటుందని మాత్రం తెలుస్తోంది. అది మానవ చరిత్రగతిని సమూలంగా మార్చి ఓ నూతన ప్రపంచ ఆవిష్కరణకు నాందీవాచకం పలికిన రాత్రి. ఈ మహా రాత్రినే షబేఖదర్ లేక లైలతుల్ ఖదర్ అంటారు. ఈ ఒక్కరాత్రి చేసే పుణ్యకార్యం వేయి నెలల సత్కార్యాలతో సమానం. అందుకే ముస్లింలు ఈ రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

ఖుర్‌ఆన్‌లోని 97వ అధ్యాయంలో, దైవదూతలు ఈ రాత్రిన తమ ప్రభువాజ్ఞతో అన్ని విధాల ఉత్తర్వులను, ఆదేశాలను తీసుకొని భువిపై అవతరిస్తారని ఉంది. 44వ అధ్యాయంలో ఈ రాత్రిని దైవాజ్ఞతో సమస్త వ్యవహారాలకు సంబంధించిన తిరుగులేని నిర్ణయాలు జారీచేయబడే రాత్రి అని పేర్కొనడం జరిగింది. దైవప్రవక్త బోధించిన కొన్ని ప్రవచనాలను బట్టి దైవాజ్ఞ ప్రకారం దైవదూతలు ఈరాత్రి మానవప్రపంచాన్ని సందర్శిస్తారు. ఒక ఏడాది కాలానికి వ్యక్తుల, జాతుల మంచీచెడులకు, కష్టసుఖాలకు సంబంధించిన వార్షిక భవితవ్యాన్ని నిర్ణీత ఘడియల ప్రకారం అమలు పరిచేందుకు దేవుడు ఈ దూతల్ని నియమిస్తాడు. అంటే ఒక ఏడాది కాలంలో సంభవించబోయే మానవుల పుట్టుక, చావు, కలిమిలేములు, యుద్ధాలు, కరువులు, ఇతర ప్రకృతివైపరీత్యాలు, సత్కర్మలు, దుష్కర్మలు మొదలైన సమస్త సంఘటనలు, విషయాలకు సంబంధించిన దైవనిర్ణయాలను తీసుకొని దైవదూతలు ఈ రాత్రి భూలోకానికి దిగివస్తారు. కనుక ఈ శుభరాత్రిని లైలతుల్ హుక్మ్ అని, లైలతుత్తక్దీర్ అని కూడా అంటారు.

ఈ నెలలో మరోవిశేషం అత్యధిక దానధర్మాలు చేయడం. భక్తి, భుక్తి కలిసినప్పుడే మనిషికి ముక్తి లభిస్తుంది. పేదవాడి ఆకలి బాధను ఆచరణాత్మకంగా అర్థం చేసుకోవడానికి ఉపవాసవ్రతమే ఉత్తమసాధనం. కడుపు నింపుకోవడం జీవితం అసలుధ్యేయం కాదని, దానికంటే జీవితానికి ఎంతో విలువ ఉందని ఉపవాసవ్రతం మనకు తెలియజేస్తుంది. ఓసారి దైవప్రవక్త (సల్లం) ఒకతను తేన్పుతుంటే చూసి, నీ తేన్పు తగ్గించుకో. ప్రపంచంలో ఉండగా బాగా కడుపునిండా తిన్నవాడు ప్రళయదినాన అందరికంటే ఎక్కువ ఆకలితో ఉంటాడని అన్నారు. (తిర్మిజి)

రమజాన్ నెలలో ఫిత్రా దానానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. సమాజంలో కడుపు నిండా తిండికి, ఒంటి నిండా బట్టకు సైతం నోచుకోని అభాగ్యజీవులు ఎందరో ఉన్నారు.

పండుగ సందర్భంలో ఇలాంటి పేదలకు, అవసరార్థులకు ప్రత్యేక దానం చేయాలని ఇస్లాం ఆదేశిస్తోంది. దీన్నే ఫిత్రా దానం అంటారు. రమజాన్ పండుగను ఈదుల్‌ఫితర్ అని కూడా అంటారు. అంటే ఉపవాసాలు ముగించి సంతోషించే రోజన్న మాట. ఉపవాసాలు విజయవంతంగా ముగిసినందుకు దేవుని పట్ల కృతజ్ఞగా, పేదలకు ఫిత్రాదానం విధిగా అందజేయాలి.

ఫిత్రా పేదలహక్కు. ఇస్లాం మానవుల సహజ భావోద్రేలను సమాజంలోని పేద ప్రజల సంక్షేమానికి ఎలా వినియోగం చేస్తుందో చూడండి. రమజాన్ ఉపవాసాలు పూర్తికావడం విశ్వాసికి ఓ సంతోషకరమైన విషయమైతే, ఆ సంతోషం వ్యక్తమవడానికి ఇస్లాం అతని చేత పేదలకు ఫిత్రా రూపేణ కొంత ఆర్థికసహాయాన్ని అందజేయిస్తుంది. ఈ ఫిత్రా పాప పరిహారంగా కూడా పరిణమిస్తుంది. ప్రవక్త ప్రత్యక్ష అనుచరుడు అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఫిత్రా ప్రాముఖ్యాన్ని తెలుపుతూ ఈ విధంగా అన్నారు :

“దైవప్రవక్త (స) ఫిత్రాదానాన్ని విధిగా నిర్ణయించడానికి కారణం– ఉపవాసంలో పొరపాటున మన నోట పనికిమాలిన మాటలు వెలువడవచ్చు. అదీగాక అనాలోచితంగా మన హృదయంలో చెడుతలంపులు కూడా కలుగుతుంటాయి. ఫిత్రా దానం వల్ల (ఈ పొరపాట్లన్నీ క్షమించబడి) ఉపవాసాలు పరిశుద్ధమవుతాయి. మరోవైపు దీనిద్వారా పేదలకు తిండి, బట్ట (లాంటి ప్రాథమిక అవసరాలు) కూడా సమకూరుతాయి.” (మిష్కాత్)

ఫిత్రా దానంగా దాదాపు పావుతక్కువ రెండు కిలోల గోధుమలుగాని, లేదా దానికి సమాన విలువగల ఇతర ధాన్యాలుగాని ఇవ్వాలి. లేదా అంత విలువైన డబ్బయినా ఇవ్వవచ్చు. ఆర్థిక స్తోమత కలిగిన ప్రతి వ్యక్తీ ఫిత్రా దానం చేయాలి. అంతేకాదు, ఫిత్రా దానం కుటుంబంలోని సభ్యులందరి తరఫున పేదలకు అందాలి. పేద ప్రజలు సంతోషంగా పండుగ జరుపుకోడానికి వీలుగా ఫిత్రా పండుగకు ముందే వారికి అందజేయబడాలి.

రమజాన్ ఎంతో పవిత్రమైన నెల గనక, కొందరు పేదల ఆర్థిక హక్కయిన జకాత్ కూడా ఈ నెలలోనే చెల్లిస్తారు. ప్రతి ధనికుడు ప్రతి సంవత్సరాంతంలో మిగిలిన తన సంపద నుండి రెండున్నర శాతం చొప్పున ధన కనక వస్తువులు ఏవైనా నిరుపేదల కోసం, ధర్మసంస్థాపన కోసం ఖర్చు చేయవలసి ఉంటుంది. దీన్నే జకాత్ అంటారు.

రమజాన్ నెల ముగిసిపోగానే షవ్వాల్ నెలవంక ప్రత్యక్షమవుతుంది. ఈ నెలవంకను చూడగానే ముస్లింలు రమజాన్ ఉపవాసవ్రతాలు విరమిస్తారు. దీనికి సూచనగా మసీదుల్లో మైకుల ద్వారా సైరన్లు మోగుతాయి. ఆ మరునాడు ఉదయమే పండుగ.

ముస్లింలకు రెండే రెండు పండుగలు ముఖ్యమైనవి. అవి రమజాన్ నెల తర్వాత షవ్వాల్ మొదటి తేదీన వచ్చే ఈదుల్‌ఫితర్ పండుగ, ఆ తర్వాత బక్రీద్ నెల పదో తేదీన వచ్చే ఈదుల్‌అజ్హా పండుగ. ఇవి దేవుడు తన అంతిమ ప్రవక్త ముహమ్ముద్ (సల్లం)



ద్వారా నిర్దేశించిన పండుగలు. ఇవి మానవ జీవితానికి అపూర్వ సందేశాన్ని, స్ఫూర్తిని, దీప్తిని ఇచ్చే పండుగలు. మానవుల ఇహపర శ్రేయాల కోసం సృష్టికర్త నిర్దేశించిన జీవన సరళికి, ఆచరణ విధానానికి అద్దంపట్టే పండుగలు ఇవి.

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) మక్కా నుండి మదీనాకు వలస వచ్చిన కొత్తలో మదీనా వాసులు సంవత్సరంలో రెండు రోజులు పర్వదినాలుగా పాటించి, పండగ చేసుకునే వారు. ఈ విషయం తెలిసి దైవప్రవక్త మదీనా వాసులతో “దేవుడు మీ కోసం ఈ రెండు రోజుల కంటే శ్రేష్ఠమైన మరో రెండురోజుల్ని (పండగ దినాలుగా) ఏర్పాటు చేశాడు. అవి– బక్రీద్ (ఈదుల్ ఫితర్), రమజాన్ (ఈదుల్ అజ్హా)” అని చెప్పారు.

దీన్ని బట్టి ఈ రెండు రోజులు తప్ప మరే ఇతర రోజుల్లో పండగ చేయడం, పండగలా ఆ రోజు ప్రత్యేక వంటకాలు చేయడం, తినడం, పర్వదినంగా భావించి ఆనందోత్సవాలు జరుపుకోవడం వంటి పనులు చేయకూడదని తెలుస్తోంది.

రమజాన్ పండగనాడు ఈద్ నమాజ్‌కు వెళ్ళే ముందు ఖర్జూర పండ్లుగాని, లేదా మరేదైనా తీపిపదార్థంగాని తినడం సంప్రదాయం. అలాగే ఈద్ నమాజ్‌కు వెళ్ళక ముందే ఫిత్రాదానం పేదలకు ఇచ్చివేయాలి. ఫిత్రా రెండు మూడు రోజులకు ముందే ఇచ్చివేస్తే మరీ మంచిది.

ఈద్ నమాజ్‌కు వెళ్తూ దారిలో తక్బీర్ మాటలు ఉచ్చరిస్తూ నడవాలి. సూర్యోదయం అయిన కాస్సేపటి తరువాత సామూహికంగా ఈద్ నమాజ్ చేయడం జరుగుతుంది. నమాజ్ ముగిసిన తరువాత ఇమామ్ ప్రత్యేక ఉపన్యాసం ఇస్తాడు. ఇతర ముస్లింలు దాన్ని శ్రద్ధగా వింటారు. ఇలా ఉపన్యాసం ఇవ్వడం, వినడం కూడ ఇస్లాం సంప్రదాయాల్లోని భాగమే. ఉపన్యాసం తర్వాత ఇమామ్ దుఆ (వేడుకోలు) చేయడం, ఇతరులు ఆమీన్ (తథాస్తు) అని పలకడం జరుగుతుంది. ఆ తర్వాత ముస్లింలు పరస్పరం కలుసుకొని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. దాంతో రమజాన్ కార్యకలాపాలు, పండగ సంబరాలు సమాప్తమవుతాయి. ☸

శుభం, శ్రేయో ప్రాప్తిరస్తు!